సాక్షి కామారెడ్డి

గురువారం । 28 । డిసెంబర్ । 2023



చేపలు చచ్చిపోతున్నాయి

జిల్లాలో ఫిష్ ఫామ్‌లు సత్ఫలితాలు ఇవ్వడం లేదు. చేపలు చనిపోతుండడంతో రైతులు నష్టపోతున్నారు.

- 9లో ▸



విద్యార్థుల కోసం..

విద్యార్థుల సంఖ్యకు సరిపడా బస్సులు నడపాలని ఏబీవీపీ నాయకులు కామారెడ్డి ఆర్టీసీ డిపో మేనేజర్‌ను కోరారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

30.8 /12.8

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత కాస్త తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి'

కామారెడ్డి క్రైం: పొగమంచు విషయంలో ప్రయాణికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ సింధు శర్మ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు సరిగా కనిపించక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. వాహనాలు నడిపే వ్యక్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహన చోదకులు తక్కువ వేగంతో వెళ్లాలని, ఇండికేటర్‌లను వాడాలని పేర్కొన్నారు. రహదారిపై దృష్టి కేంద్రీకరించడంతో పాటు వాహనాల మధ్య దూరం పాటించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ సూచనలు పాటించాలని కోరారు.

ఖోఖో రాష్ట్ర జట్టుకు ఎంపిక



ఎల్లారెడ్డి: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి గౌతం ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ కృతమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో చత్తీస్‌గడ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో గతం రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకుల విద్యాలయాల్లో 2024–25వ విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు 2023–24 విద్యాసంవత్సరం ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 4వ తరగతి చదువుతూ ఉండాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల విద్యార్థుల తల్లిదండ్రులు www. tswreis. telangana. in వెబ్‌సైట్ ద్వారా పరీక్ష కోసం జనవరి 6వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గురుకుల పాఠశాలలో నాణ్యమైన ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు, మూడు మున్సిపాలిటీల పరిధిలోని 80 వార్డులలో ప్రజా పాలన గ్రామసభల నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. కార్యక్రమాల నిర్వహణ కోసం అధికారుల బృందాలను నియమించింది. ఒక్కో బృందం సభ్యులు రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామంలో నిర్వహించే సభలలో పాల్గొని, దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే ప్రజలు ఇబ్బందిపడకుండా ఉండేందుకు ప్రతి వంద కుటుంబాలకు ఒక కౌంటర్ చొప్పున జిల్లాలో 2,447 కౌంటర్‌లు ఏర్పాటు చేయనున్నారు.





దరఖాస్తుల స్వీకరణకు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ప్రజాపాలనకు శ్రీకారం!

- నేటి నుంచి గ్రామ, వార్డు సభలు
- గ్యారంటీ స్కీమ్‌ల అమలు దిశగా అడుగులు
- దరఖాస్తులు స్వీకరించనున్న యంత్రాంగం

సాక్షి, కామారెడ్డి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కాంగ్రెస్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత వంటి పథకాలకు ప్రజలనుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రజా పాలన పేరుతో గ్రామ సభలు నిర్వహించాలని నిర్ణయించింది. గురువారం గ్రామసభలు ప్రారంభం కానున్నాయి. ఈ సభలు వచ్చేనెల 6వ తేదీ వరకు సాగుతాయి. ఆయా పథకాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రభుత్వమే అందిస్తుంది. అర్హులు దరఖాస్తులను నింపి గ్రామ సభ రోజున అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది.

దరఖాస్తులపై అయోమయం..

అయా సంక్షేమ పథకాల అమలుకోసం సర్కారు దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించడంతో ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే ఇదే సమయంలో అయోమయ పరిస్థితి నెలకొంది. గ్యారంటీ పథకాలకు పాత లబ్ధిదారులూ దరఖాస్తు చేసుకోవాలా అన్న అంశంపై స్పష్టత లేదు. అలాగే అద్దె ఇళ్లలో ఉంటున్నవారికి గృహజ్యోతి పథకం వర్తిస్తుందా? ఉపాధి కోసం వేరే పట్టణాలు, గ్రామాలకు వలస వెళ్లినవారు ఆయా పథకాలకు ఎక్కడ దరఖాస్తు చేయాలి? గ్యాస్ సిలిండర్ రాయితీ కోసం సొంత ఊళ్లో దరఖాస్తు చేసుకోవాలా లేక బతకడానికి వెళ్లిన చోటే అర్జీ పెట్టుకోవాలా అన్న విషయాలపై అయోమయం నెలకొంది. గ్యారంటీల అమలుకు రేషన్ కార్డు తప్పనిసరి అని పేర్కొనడంతో రేషన్‌కార్డు లేనివారు ఆందోళన చెందుతున్నారు. ఆయా అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పకడ్బందీగా సభలు నిర్వహించాలి



కామారెడ్డి టౌన్: జిల్లాలోని 526 గ్రామ పంచాయతీలు, 80 మున్సిపల్ వార్డులలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కట్టుదిట్టంగా ప్రజాపాలన సభలు నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మను చౌదరి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా ప్రజాపాలన గ్రామ, వార్డు సభల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణపై సూచనలు ఇచ్చారు. అర్హులైన వారికి దశలవారీగా, నిర్దేశిత కాలవ్యవధిలో సామాజిక భద్రత కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమం చేపట్టిందన్నారు. కార్యక్రమ నిర్వహణ కోసం ప్రతి మండలం పరిధిలో తహసీల్దార్, ఎంపీడీవోల ఆధ్వర్యంలో రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఆ బృందాలు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రెండు గ్రామ పంచాయతీలలో సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. ప్రజాపాలన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు. గ్రామసభకు ఒకరోజు ముందే ప్రజలకు దరఖాస్తు ఫారాలు అందించాలన్నారు. దరఖాస్తుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. నిరక్షరాస్యులు దరఖాస్తులు నింపడంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు సహకరించాలన్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

మోదీ పాలనలో దేశం ముందంజ

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి



దోమకొండ: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశం అభివృద్ధిలో ముందంజలో ఉందని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లింగుపల్లిలో వికసిత్ భారత్ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గత 58 ఏళ్లలో కాంగ్రెస్ హయాంలో జరగని అభివృద్ధి మోదీ పాలనలో జరిగిందన్నారు. ప్రతి భారతీయుడు గర్వపడేలా దేశం అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీపడుతూ ముందుంజలో నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం వికసత్ భారత్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, బీజేపీ మండలాధ్యక్షుడు చింతల రాజేష్, నాయకులు భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నోడల్ అధికారిగా క్రిస్టీనా జెడ్ చోంగ్తూ



సాక్షి, కామారెడ్డి: ప్రజా పాలన కార్యక్రమం అమలు తీరును జిల్లా స్థాయిలో పరిశీలించేందుకు వీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను నోడల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నోడల్ అధికారిగా సీనియర్ ఐఏఎస్ క్రిస్టీనా జెడ్ చోంగ్తూను నియమించారు.

విచ్చలవిడిగా స్మోకింగ్ జోన్‌లు!

- టీ సెంటర్ల పేరిట కేంద్రాల ఏర్పాటు
- చాయి కంటే సిగరెట్లకే గిరాకీ ఎక్కువ
- ధూమపానానికి బానిసవుతున్న కాలేజీ విద్యార్థులు



కామారెడ్డి కొత్తబస్టాండ్ పక్కన ఏర్పాటు చేసిన స్మోకింగ్ జోన్‌లో కళాశాలల విద్యార్థులు

కామారెడ్డి టౌన్: జిల్లాలో విచ్చలవిడిగా స్మోకింగ్ జోన్‌లు వెలుస్తున్నాయి. ఫలితంగా కాలేజీ విద్యార్థులు ధూమపానానికి బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. కొందరు టీ పాయింట్ల పేరిట ప్రత్యేకంగా స్మోకింగ్ జోన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ముందు చూస్తే టీ పాయింట్‌లు.. లోపలికి వెళ్లి చూస్తే సిగరెట్ తాగేవారికి ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. జిల్లాలో చాలా ప్రాంతాల్లో ఈ స్మోకింగ్ జోన్‌లు వెలుస్తున్నాయి. దీంతో యువత ముఖ్యంగా కళాశాల విద్యార్థులు ఈ సెంటర్‌లను ఆశ్రయిస్తూ స్మోకింగ్‌కు బానిసవుతున్నారు. దీంతో నిత్యం చాయి కంటే సిగరెట్స్ ఎక్కువగా అమ్ముడుపోతున్నాయని వ్యాపారులే చెబుతున్నారు.

కామారెడ్డిలో గల్లీకి ఒకటి..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో చాలా స్మోకింగ్ జోన్‌లు వెలిశాయి. కొత్తబస్టాండ్ ప్రాంతంలో ఆరు, ప్రియా టాకీస్ రోడ్‌లో సెల్లార్‌లో ఒకటి, రైల్వే స్టేషన్ దారిలో మూడు, మున్సిపల్ ఆఫీస్ ఏరియాలో రెండు, నిజాంసాగర్ చౌరస్తాలో నాలుగు, దేవునిపల్లి రోడ్‌లో మూడు, హౌజింగ్ బోర్డు వైపు రెండు స్మోకింగ్ సెంటర్లు ఉన్నాయి. జిల్లా కేంద్ర ఆస్పత్రి ఎదురుగా, పక్కన, అలాగే పాత బస్టాండ్‌లో రెండు, దర్శన్‌టాకీస్ రోడ్‌లో రెండు, సిరిసిల్లారోడ్ స్వాతి హోటల్ ముందు ఓ పాన్ దుకాణం వెనకాల స్నూకర్ గేమ్‌తో పాటు స్మోకింగ్ జోన్, సిరిసిల్ల రోడ్‌లో కింద టీ పాయింట్ మొదటి అంతస్తులో సిగరెట్ జోన్, రాజీవ్‌నగర్‌కాలనీలో ఒకటి ఇలా జిల్లా కేంద్రంలోనే వంద వరకు స్మోకింగ్ జోన్‌లు ఉన్నాయి. అలాగే బాన్సువాడ, ఎల్లారెడ్డితో పాటు ఆయా మండలాల్లో సైతం కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా స్మోకింగ్ జోన్లు ఏర్పాటు చేశారు. జిల్లాలో సుమారు 500లకు పైగా ఇలాంటి సెంటర్‌లు ఉన్నాయి. ఇందులో ముందర టీ పాయింట్ వెనకాల సిగరెట్ తాగడానికి ఎవరికి కనబడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారు.

దృష్టి సారిస్తేనే..

యువత, విద్యార్థులు పక్కదారి పట్టడంపై ప్రధానంగా తల్లిదండ్రులు దృష్టి సారించాలని నిపుణులు తెలుపుతున్నారు. అలాగే పోలీసులు, అధికారులు సైతం స్మోకింగ్ జోన్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇవి ఇలాగే కొనసాగితే విద్యార్థుల భవిష్యత్ పాడవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సెంటర్లలో పొగ తాగుతూ ఆన్‌లైన్ గేమ్స్, చాటింగ్‌లలో మునిగి కొందరు తామ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

ఆన్‌లైన్ షాపింగ్‌లో జాగ్రత్తలు పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు

- జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు

కామారెడ్డి టౌన్: ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈ– కామర్స్, డిజిటల్ వర్తకంలో వినియోగదారుల రక్షణ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కామర్స్ ప్లాట్ ఫారమ్స్ వస్తువులు తయారు చేస్తున్న కంపెనీకి, వాటిని కొనుగోలు చేస్తున్న వినియోగదారులకి మధ్య వారధిగా మాత్రమే ఉంటాయన్నారు. గుర్తింపు కలిగిన ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్స్ నుంచే కొనుగోలు చేయాలన్నారు. ఉచిత బహుమతులు, డిస్కౌంట్లను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఖరీదైన వస్తువులను కొనేటప్పుడు సాధ్యమైనంత వరకు క్యాష్ ఆన్ డెలివరీ ఎంచుకోవాలని చెప్పారు. డిజిటల్ లావాదేవీలు, సమాచారం మార్పిడి చేసేటప్పుడు జాగ్రతలు పాటించాలన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర వినియోగదారుల సహాయక కేంద్రం ద్వారా వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. వినియోగదారులు 1800 4250 0333/1967కి ఫోన్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చని తెలిపారు. జిల్లా కార్మిక శాఖ అధికారి సురేంద్ర కుమార్ మాట్లాడుతూ.. దుకాణాల నిర్వహణ కోసం లైసెన్సులు పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. జిల్లా పౌర సరఫరాల మేనేజర్ అభిషేక్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, మెప్మా పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా వినియోగదారుల సంఘాల సమైక్య అధ్యక్షురాలు బొమ్మెర సువర్ణ చంద్రశేఖర్, జిల్లా డీలర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మిపతి, రేషన్ షాప్‌లు, గ్యాస్ ఏజెన్సీల డీలర్లు, రైస్ మిల్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

ఆశ చూపి.. రూ.కోట్లతో ఉడాయింపు!

- రూ.20 లక్షలకు రూ.80 లక్షలు ఇస్తానని మోసం
- వెలుగు చూస్తున్న ప్రిన్సిపాల్ మోసాలు

ఆర్మూర్: ప్రజల అత్యాశను ఆసరాగా చేసుకొని రూ.రెండున్నర కోట్లతో ఉడాయించిన ఆర్మూర్‌లోని ఓ పాఠశాల ప్రిన్సిపాల్ లీలలు ఒక్కొటిగా బయటకు వస్తున్నాయి. ఇరవై రోజుల్లో రూ.20 లక్షలకు రూ.80 లక్షలు ఇస్తానని వేల్పూర్ మండలం కోమన్‌పల్లికి చెందిన ఒక బాధితుడికి 2022 అక్టోబర్‌లో రాసిచ్చిన బాండ్ పేపర్ వెలుగులోకి వచ్చింది. ఆర్మూర్ పట్టణం పెర్కిట్‌లోని కార్పొరేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూ.రెండున్నర కోట్లు వసూలు చేసి పరారీ అయిన విషయం విదితమే. పాఠశాల యాజమాన్యం మాత్రం అతని అక్రమాలు తెలియడంతో పాఠశాలకు చెల్లించాల్సిన డబ్బులను వసూలు చేసుకొని జూలైలోనే ఉద్యోగంలో నుంచి తొలగించామని చెబుతోంది. అయితే అతను పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలోనే పలువురి వద్ద డబ్బులు తీసుకొని రాసి ఇచ్చిన బాండ్ పేపర్లు వెలుగులోకి వస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అప్పుగా డబ్బులు వసూలు చేయడంతో పాటు జర్మనీ లాంటి విదేశాలకు సైతం పంపిస్తానంటూ నమ్మబలికి మరికొందరు నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.ఆరు లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మూడు నెలల్లో విదేశాలకు పంపించని పక్షంలో వారి డబ్బులు వారికి తిరిగి ఇచ్చేస్తానంటూ ఈ ఏడాది జనవరిలో బాండ్ పేపర్లలో రాసి ఇచ్చాడు. విషయం బయటకు పొక్కడంతో కుటుంబ సభ్యులతో సహా పరారీ అయ్యాడు. ప్రిన్సిపాల్ పరారీ అయినట్లు వార్తలు రావడంతో బాధితులు బయటకు వస్తున్నారు. అయితే అత్యాశకు పోయి లక్షల రూపాయలు ఇచ్చిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే ఎక్కడ తిరిగి తమ మెడకే చుట్టుకుంటుందోననే భయంతో ఫిర్యాదు చేయడానికి జంకుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

కలిసిరాని కాలం!

- అకాల వర్షాలు, వడగళ్లు.. ఆపై తెగుళ్ల దాడి
- దిగుబడులు తగ్గి రెక్కల కష్టం వృథా
- యాసంగిలో లాగోడీ చేతికిరాని వైనం
- రైతన్నకు నష్టాలు మిగిల్చిన 2023



ధాన్యం రాశుల చుట్టూ చేరిన వర్షం నీరు(ఫైల్)



వర్షంతో తడిసిన వరిని తీస్తున్న రైతు (ఫైల్)

సాక్షి, కామారెడ్డి: ప్రకృతి ప్రకోపం రైతులకు శాపంగా మారింది. వాతావరణంలో మార్పులతో పంటలను తెగుళ్లు దెబ్బతీశాయి. ఈ ఏడాది వర్షాలు పుష్కలంగా కురిశాయని సంతోషించిన రైతులకు తెగుళ్లు ఆపై వడగళ్ల వానలు తీరని నష్టాన్ని కలిగించాయి. వానాకాలంతో పాటు యాసంగి సీజన్లలోనూ అనుకున్న స్థాయిలో దిగుబడులు రాకపోవడంతో రైతులకు నష్టాలే మిగిలాయి. పంటలు దెబ్బతిన్నపుడు పరామర్శలే తప్ప పరిహారం అందించిన వారు లేకుండాపోయారు. 2023 సంవత్సరంలో పంటల పరిస్థితులపై 'సాక్షి' కథనం..

జిల్లాలో వానాకాలంలో సుమారు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. వరి పంటనే అధిక విస్తీర్ణంలో సాగవుతుంది. యాసంగిలో నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా, వరి పంట సగభాగం ఆక్రమిస్తోంది. అయితే ఈ ఏడాది రైతన్నకు కాలం కలిసి రాలేదు. 2021–22 వానాకాలంలో 6.48 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవగా, 2022–23 వానాకాలంలో 4.75 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అయ్యింది. 2021–22 యాసంగిలో 4.04 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా 2022–23 యాసంగిలో 3.60 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చింది. వానాకాలం, యాసంగి రెండు సీజన్లలోనూ ధాన్యం ఉత్పత్తి తగ్గిపోయింది. దీనికి ప్రధాన కారణం తెగుళ్లు, వడగళ్ల వానలు. ఏడాదికేడాది పంటల సాగు విస్తీర్ణం పెరుగుతున్నా దిగుబడులు మాత్రం తగ్గిపోతున్నాయి.

రుణమాఫీ.. రైతుబంధుపై ఆశలు

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వంపై రైతుల్లో ఎన్నో ఆశలు ఉన్నాయి. రూ.రెండు లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల వాగ్దానంలో పేర్కొన్నారు. దీంతో జిల్లాలో వేలాది మంది రైతులకు ప్రయోజనం కలుగనుంది. గతంలో రుణమాఫీ సరిగా జరగకపోవడంతో రైతుల అప్పులు రెట్టింపయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలు మాఫీ చేస్తామన్న నేపథ్యంలో రుణవిముక్తి కలుగుతుందని రైతులు ఆశతో ఉన్నారు. అలాగే యాసంగి పంటల సాగుకు సంబంధించి రైతుబంధు జారీలో ఆలస్యం అవుతోంది. ఎకరాకు రూ.7,500 చొప్పున ఇస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. అయితే ఈ పంటలకు గతంలో ఇచ్చినట్టుగానే రూ.5 వేలు ఇస్తున్నారు. అది కూడా కొద్దిమందికి జమ అయ్యింది. ఇంకా చాలా మందికి రైతుబంధు రావలసి ఉంది.

చేతికొచ్చిన పంట నేలపాలు

యాసంగి సీజన్‌లో పంట చేతికొచ్చిన సమయంలో ఏప్రిల్ చివరలో వడగళ్లు, ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో 62 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు అధికారిక లెక్కలే చెబుతున్నాయి. అంతకుపైనే పంటలకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా వరి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. వేలాది ఎకరాల్లో వరి గింజలు నేలరాలిపోయాయి. దీంతో రైతులు పెట్టుబడులు కూడా కోల్పోయారు. కామారెడ్డి మండలంలో దెబ్బతిన్న పంటలను అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించారు. అలాగే లింగంపేట మండలంలో తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం వడగళ్ల బాధితులను పరామర్శించారు. దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా నియోజక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా రైతులను పరామర్శించారు.

దెబ్బతీసిన తెగుళ్లు

వాతావరణంలో ఏర్పడిన మార్పులతో ఈ ఏడాది యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలకు పలు రకాల తెగుళ్లు ఇబ్బంది పెట్టాయి. వరికి రకరకాల తెగుళ్లు సోకి పంట దిగుబడి పడిపోయి రైతులు నష్టపోయారు. పత్తి, సోయా, మక్క పంటలకూ తెగుళ్లు సోకాయి. పంటలను కాపాడుకునేందుకు రైతులు క్రిమిసంహారక మందుల పిచికారీకి పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. వానాకాలంలోనూ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలు చోట్ల తెగుళ్లతో పంటలు దెబ్బతిన్నాయి.

రివైండ్ 2023



నర్సన్నపల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి (ఫైల్)



బోనాల గ్రామంలో వడగళ్లతో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం (ఫైల్)

క్లుప్తంగా

రిపబ్లిక్ డే పరేడ్‌కు సీఎస్ఐ విద్యార్థి ఎంపిక


నితిన్

నిజామాబాద్‌నాగారం : ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ పరేడ్‌కు నగరంలోని సీఎస్ఐ కళాశాల ఎన్‌సీసీ కెడెట్ నితిన్ ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ భాగ్యరావు బుధవారం తెలిపారు. బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి నితిన్ ఢిల్లీ పరేడ్‌కు ఎంపిక కావడం ఆనందంగా ఉందని ఎస్‌సీసీ అధికారి కెప్టెన్ ఎం. రాజేశ్వర్ అన్నారు. అనంతరం నితన్‌ను పలువురు అధ్యాపకులు అభినందించారు.

నేడు నిధి ఆప్‌కే నికట్

ఇందల్వాయి: మండలంలోని జ్ఞాన వాగ్దేవి కళాశాలలో ఈపీఎఫ్‌వో నిధి ఆప్‌కే నికట్ 2.0 కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు రీజినల్ ఆఫీసర్ శివకుమార్ బుధవారం తెలిపారు. పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు అందరు తగిన ఆధారాలతో కార్యక్రమానికి హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరగవు



ఖలీల్‌వాడి: డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ఆర్టీసీ ఆర్ఎం జానీరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ డిపో–1లో రోడ్డు ప్రమాదాలను నివారించే పరికరాలను తయారు చేసి, బస్సుల్లో అమర్చే 'ఐ–రాస్టే' సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ డ్రైవర్లకు సన్మాన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. 15 మంది ఉత్తమ డ్రైవర్లను సన్మానించి, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆపరేషనల్ మేనేజర్ పృథ్వీరాజ్, డిప్యూటీ ఆర్ఎం శంకర్, డిపో మేనేజర్ ఆనంద్, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యాధికారులు అప్రమత్తంగా ఉండాలి

నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జిల్లా వైద్యాధికారులు, మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సుదర్శనం బుధవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొనే ప్రజలకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. కొవిడ్ నిబంధనలు పాటించే విధంగా చూడలన్నారు.

'అనుభవాలకు అక్షర రూపమే సాహిత్యం'



కామారెడ్డి అర్బన్: విద్యార్థులు తమ నిత్యజీవితంలో అనుభవాలకు కొన్ని మెలకువలతో అక్షర రూపం ఇస్తే గొప్ప బాల సాహిత్యం అవుతుందని ప్రముఖ రచయిత, బాల సాహితీ వేత్త డాక్టర్ వీఆర్ శర్మ అన్నారు. బుధవారం దేవునిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'సాహితీ సృజనాత్మక' అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే రచనలు చేయడం అలవాటు చేసుకోవాలని అన్నారు. కథలు, కవితలు, పాటలు, గేయాలు, వివిధ తెలుగు సాహితీ ప్రక్రియలను రాయడంలో మెలకువలను తెలియజేశారు. సాహితీ సృజనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. హెడ్‌మాస్టర్ గంగాకిషన్, తెలుగు ఉపాధ్యాయురాలు, రచయిత్రి నమిలికొండ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏజెంట్లు చెబితేనే రుణాలు..?

- సామాన్యులకు దక్కని పీఎంఈజీపీ లోన్లు
- ఇబ్బందుల్లో ఖాతాదారులు



సదాశివనగర్: బ్యాంకుల ద్వారా సామాన్య ప్రజలకు అందాల్సిన కేంద్ర ప్రభుత్వ రుణాలు సామాన్య ప్రజలకు అందడం లేదు. కమీషన్లకు కక్కుర్తిపడిన సదరు అధికారులు ప్రజల దరఖాస్తులను చెత్తబుట్టలో పారేస్తున్నారు. అదే ఏజెంట్ల ద్వారా వచ్చిన దరఖాస్తులను తక్షణమే ఓకే చేసి రుణాలను మంజూరు చేస్తున్నారు. మండలంలోని యూనియన్ బ్యాంక్‌లో రోజుకో విషయం బయటపడుతోంది. రైతులు, ప్రజలు బ్యాంకులో ఏ రుణం కావాలన్నా అధికారులు స్పందించరు. కానీ ఏజెంట్ల ద్వారా బ్యాంకుకు అందిన దరఖాస్తులను తక్షణమే రుణాలు మంజూరవుతున్నాయి. ఇందుకు మచ్చుకగా సదాశివనగర్ మండలం అమర్లబండకు చెందిన ఎస్సీ వారికి 35 శాతం రాయితీపై రుణం ఇవ్వాలని నిబంధన ఉంది. దీంతో సర్పంచ్ భర్త కొత్తూరి రాజేశ్వర్ పీఎంఈజీపీ(ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్) రుణం కింద రూ. 5లక్షలు కావాలని బ్యాంక్‌లోని ఆర్‌డీవోను కలిశారు. సదరు బ్యాంకు అధికారి టార్గెట్ పూర్తయిందని తెలిపారు. కానీ అదే గ్రామానికి చెందిన బ్యాంక్ బ్రోకర్‌లుగా ఉన్న ఇద్దరి వ్యక్తులు, వారికి కావాల్సిన పలువురి రూ. 5లక్షల రుణ దరఖాస్తులను బ్యాంకు అధికారులు స్వీకరించి రుణాలు మంజూరు చేశారని రాజేశ్వర్ తెలిపారు. సదరు బ్యాంక్ ఆర్‌డీవో కమీషన్లకు కక్కుర్తి పడి సామాన్య ప్రజల దరఖాస్తులకు విలువ లేదని, కమీషన్ ఏజెంట్లదే ఇక్కడ హవా కొనసాగుతోందని అన్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బ్యాంక్‌లో ఇంటిపత్రాలు మాయం..

మండల కేంద్రానికి చెందిన గోస్కె ఆనంద్ ఇటీవల బ్యాంకు నుంచి బీసీ రుణం పొందాడు. రుణం తీసుకునే ముందు ఇంటికి సంబంధించిన ఒరిజినల్ పత్రాలు సమర్పించాలని బ్యాంక్ అధికారులు సూచించడంతో ఆనంద్ తన ఇంటి పత్రాలను అధికారులకు ఇచ్చాడు. తీరా రుణం చెల్లించాక అధికారులు ఇంటి పత్రాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. డాక్యుమెంట్లు దొరకడం లేదంటు నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారు. ఇదొక ఆనంద్‌కు ఎదురైన ఘటన కాదు చాలా మంది బాధితులు ప్రతి రోజు బ్యాంకులో ఎదుర్కొంటున్న సమస్య. ఉన్నతాధికారులు దృష్టి సారించి బ్యాంక్‌లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటి పత్రాలు మాయం జేసిండ్రు



నాకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు అయింది. రుణం ఇవ్వడానికి ముందు ఇంటికి సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్ పెట్టాలని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఇచ్చాను. తీసుకున్న రుణం చెల్లించడం పూర్తయినా ఇంటి డాక్యుమెంట్ ఇవ్వలేదు. దొరకడం లేదని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు.

–గోస్కె ఆనంద్, సదాశివనగర్

టార్గెట్ పూర్తయిందన్నారు



పీఎంఈజీపీ కింద రుణం కావాలని బ్యాంక్ ఆర్‌డీవోను సంప్రదించగా టార్గెట్ పూర్తయింది ఇవ్వడం కుదరదని అని చెప్పారు. అదే మా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బ్యాంక్‌లో కమీషన్ ఏజెంట్లుగా పని చేస్తున్నారు. వారికి రుణం మంజూరు చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే అది మా ఇష్టం అని బదులిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా.

–కొత్తూరి రాజేశ్వర్, అమర్లబండ

కొత్తగా బాధ్యతలు స్వీకరించా..



నేను నెల రోజుల క్రితం బ్యాంక్ మేనేజర్‌గా జాయిన్ అయ్యాను. గతంలో జరిగిన విషయాలు నాకు తెలియవు. విచారణ చేపడుతాం. అర్హులైన వారికి తప్పకుండా రుణాలు ఇచ్చే ప్రయత్నం చేస్తాం. రుణాల మంజూరులో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా చూస్తాం.

–భువనేశ్వర్ ప్రసాద్, బ్యాంక్ మేనేజర్, సదాశివనగర్

ఇందూరు గడ్డ బీజేపీకి అడ్డా..


ఎమ్మెల్యే ధన్‌పాల్‌తో బీజేపీ నాయకులు యెండల లక్ష్మీనారాయణ, బస్వ లక్ష్మీనర్సయ్య, పల్లె గంగారెడ్డి

- కార్యకర్తలే పార్టీకి వెన్నెముక
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: ఇందూరు గడ్డను బీజేపీకి అడ్డాగా అని, వచ్చే మున్సిపల్, ఎంపీ ఎన్నికల్లో కాషాయ జెండాను ఎగురవేస్తామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని ప్రగతినగర్‌లో ఉన్న మున్నూరుకాపు సంఘంలో బీజేపీ అర్బన్ నియోజకవర్గ కార్యకర్తల కృతజ్ఞత సభ బుధవారం నిర్వహించారు. ఇందూరు అంటే బీజేపీ మాత్రమే అని ప్రజలకు గుర్తుండేలా పని చేస్తానని అన్నారు. ఎమ్మెల్యేగా తనకు వచ్చే జీతాన్ని పేద విద్యార్థుల చదువుకు ఉపయోగిస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని, ఆ మాటకు కట్టుబడి ఉంటానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందేలా చూస్తానని అన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, కార్పొరేటర్లు, మోర్చాల ప్రతినిధులు, న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, సందగిరి రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ శివప్రసాద్, స్వామి యాదవ్, మల్లేశ్ యాదవ్, శంకర్, సుక్క మధు, రోషన్, గడ్డం రాజు, పుట్ట వీరేందర్, బంటు రాము తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తా

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- పెద్దకొడప్‌గల్‌లో కార్యకర్తలతో సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రానున్న ఐదు సంవత్సరాలల్లో రాష్ట్ర ప్రజలంతా జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించుకునేలా కృషి చేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. బుధవారం పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొని ప్రసంగించారు. జుక్కల్ ప్రజలు 15 ఏళ్ల నుంచి నిర్బంధంలో ఉన్నారని, ఇక్కడున్న ప్రతి పక్షం నేతలు అధికార పక్షం నాయకులతో కలిసి కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం చేశారని అన్నారు. జుక్కల్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండ చూసుకుంటానని హామీ ఇచ్చారు. మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, మోహన్, బస్వరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సొంత గూటికి కాటేపల్లి సర్పంచ్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లి గ్రామ సర్పంచ్ బోధనం విఠల్ బుధవారం మండల కేంద్రంలోని పాపనేశ్వర ఆలయంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి విఠల్ సర్పంచ్‌గా గెలిచారు.అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇప్పుడు ఎమ్మెల్యే సమక్షంలో సొంత గూటికి చేరారు. ఆయనతో పాటు, సహకార సంఘం డైరెక్టర్లు గోకని గంగాగౌడ్, అబ్బనబోయిన పెంటయ్య, కాటేపల్లి, వడ్లం గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రజాపాలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

మద్నూర్(జుక్కల్): ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు నియోజకవర్గంలో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు విజయవంతం చేయాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అభయహస్తంలో భాగంగా మహాలక్ష్మి, గృహజ్యోతి, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, చేయూత కోసం అన్ని మండలాలు, గ్రామ పంచాయతీలలో దరఖాస్తులు స్వీకరించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రసీదు సైతం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఎల్‌పీవో శ్రీనివాస్, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్పులు చేర్పులపై స్పష్టత ఏది..!

మోర్తాడ్: రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినా గతంలో జారీ చేసిన కార్డులలో మార్పులు చేర్పుల విషయంలో స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుల నుంచి మరణించినవారి పేర్లు తొలగించిన గత ప్రభుత్వం పుట్టినవారు, పెళ్లి చేసుకుని అత్తారింట్లో అడుగు పెట్టిన వారి పేర్ల నమోదు విషయంలో నిర్లక్ష్యం వహించిందనే విమర్శలు ఉన్నాయి. గురువారం మొదలయ్యే ప్రజాపాలన సభలలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. గతంలో రెండుమార్లు అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీలో అలసత్వం వహించిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆరేళ్ల క్రితం కొన్ని కార్డులను జారీ చేయగా ఆ తరువాత కార్డులను స్వీకరించలేదు. ప్రభుత్వం ఏ పథకం అమలు చేసినా రేషన్‌కార్డులను ప్రామాణికం చేసింది. అనేక మంది రేషన్ కార్డులు దక్కక పథకాలను సరిగా అందుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం సాధారణ ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త రేషన్ కార్డు లను జారీ చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికే జిల్లాలో 3,81,224 తెల్లరేషన్ కార్డులు ఉండగా 20,940 అంత్యోదయ కార్డులు, 1,061 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. కొత్తగా పేర్లు నమోదు చేయడ, మార్పులు చేర్పులకు సంబంధించి జిల్లాలో గతంలో పౌర సరఫరాల శాఖకు అందిన దరఖాస్తుల సంఖ్య 77,758 ఉన్నాయి. వీటిలో కొన్ని పౌర సరఫరాల శాఖ కమిషనరేట్ కార్యాలయం, మరికొన్ని జిల్లా పౌర సరఫరాల శాఖ, ఆర్డీవో, తహసీల్దార్, ఆర్ఐల పరిశీలనలోనే ఆగిపోయాయి. మీ సేవా కేంద్రాల ద్వారానే ఆన్‌లైన్‌లో అనేక మంది దరఖాస్తులను సమర్పించారు. రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం ఓకే చెప్పినా మార్పులు, చేర్పులకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలను జారీ చేయలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గతంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తారా లేక కొత్తగా దరఖాస్తులను అందించాల అనేది ప్రభుత్వం నుంచి స్పష్టత వస్తేనే తెలుస్తుంది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ దీనిపై స్పష్టత ఇస్తే గందరగోళానికి తెరదించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సైబర్ వలలో సికింద్రాపూర్ వాసి

జక్రాన్‌పల్లి: మండలంలోని సికింద్రాపూర్ గ్రామానికి చెందిన తొగటి అశోక్ సైబర్ మోసానికి గురయ్యాడు. ఎస్సై తిరుపతి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అశోక్‌కు ఈ నెల 26న సైబర్ నేరగాళ్లు గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ చేసి మీ బజాజ్ క్రెడిట్ కార్డు ఇన్సూరెన్స్ ఉందని ఓటీపీ చెప్పమని అన్నారు. ఇది నమ్మిన అశోక్ ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పడంతో తన అకౌంట్‌లో ఉన్న రూ. లక్షా 20 వేలు కాజేశారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ల ద్వారా ఓటీపీ చెప్పమని అడిగితే చెప్పవద్దని ఎస్సై సూచించారు.

నలుగురిపై కేసు నమోదు

భీమ్‌గల్: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు అదనపు డిప్యూటీ కమిషనర్ జయ్‌రాం బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. లింగాపూర్‌లో రెండు నెలల క్రితం ఓ స్థల వివాదంలో మున్నూరు కాపు సంఘం వారు ఓ కుటుంబాన్ని సంఘం నుంచి బహిష్కరించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జంగం రాజేశ్వర్, జంగం నర్సయ్య, చెలిమెల పెద్ద బాలయ్య, పుప్పాల పెద్ద నడిపి పోశెట్టిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

రుద్రూర్: మండలంలోని చిక్కడపల్లి శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై నీరేశ్ బుధవారం తెలిపారు. వీరి నుంచి రూ.3970 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కోళ్ల పందెం స్థావరంపై..

రుద్రూర్: మండలంలోని బొప్పాపూర్, భవానిపేట్ శివారులో కోళ్ల పందెం నిర్వహిస్తున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకొని 13 కోళ్లు, 19 కోడి కత్తులు, సెల్‌ఫోన్లు, రూ. 35,370 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నీరేశ్ పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బేస్‌బాల్ చాంపియన్లుగా జిల్లా జట్లు





నిజామాబాద్‌నాగారం: మహబూబాబాద్‌లో నిర్వహించిన బేస్‌బాల్ అండర్–19 రాష్ట్ర టోర్నమెంట్‌లో జిల్లా బాల,బాలికల జట్లు విజేతగా నిలిచాయి. తుది పోరులో నల్గొండ, మెదక్ జట్లపై జిల్లా జట్లు గెలుపొందాయి. అనంతరం మహబూబాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జ్యోతి విజేత జట్లకు బహుమతులను అందజేసినట్లు జిల్లా జూనియర్ కళాశాలల స్కూల్ గేమ్స్ కార్యదర్శి గంగాధర్ తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులను డీఐఈవో రఘురాజ్ అభినందించారు. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్లుగా మర్కంటి గంగామోహన్, నరేశ్, జ్యోత్స్న, సంతోష్ వ్యవహరించారు.

క్రైం కార్నర్

మహిళపై కేసు నమోదు


పగిలిన ఆర్టీసీ బస్సు అద్దం

నందిపేట్: ఆర్టీసీ బస్సు అద్దాలను పగులగొట్టిన మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ బస్సు ఎక్కే క్రమంలో సీటు ఆపేందుకు తన చేతిలో ఉన్న సంచి కిటికీ ద్వారా వేసింది. ఈ క్రమంలో ఆమె సంచి తప్పిపోయి బస్సు కిటికీకి తగలడంతో అది పగిలిపోయింది. గమనించిన డ్రైవర్ తుకారాం, డిపో ఎస్ఎం వీవీ రావు గ్లాసు పగులగొట్టినందుకు రూ. 200 ఇవ్వాలని మహిళను అడిగారు. తాను నగదు చెల్లించనని చెప్పడంతో వారు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. తన వద్ద డబ్బులు లేవని నందిపేటకు వెళ్లిన తర్వాత ఇస్తానని చెప్పడంతో బస్సు జిల్లా కేంద్రం నుంచి నందిపేటకు బయలు దేరింది. మార్గమధ్యలో సదరు మహిళ తన బంధువులకు ఫోన్ చేసి తనను అకారణంగా పీఎస్‌కు తీసుకెళ్లారని చెప్పింది. ఈ విషయం గమనించి డ్రైవర్ తనపై దాడి జరుగుతుందనే అనుమానంతో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. బస్సు నందిపేటకు చేరుకోగానే సదరు మహిళకు చెందిన 15 మంది డ్రైవర్‌పై దాడికి పాల్పడ్డారు. మహిళ, కొంతమంది యువకులు బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో డ్రైవర్ తుకారాం, కండక్టర్ మహేందర్ నందిపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. డ్రైవర్‌పై దాడి చేసి, బస్సు అద్దాలను ధ్వంసం చేసిన మహిళ, ఆమె బంధువులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిన్నారి అదృశ్యం

బాల్కొండ: మెండోరా మండలం దూదిగాంలో ఓ చిన్నారి అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్ బుధవారం తెలిపారు. గ్రామంలో చిత్తు కాగితాలు ఏరుకుంటు జీవనం సాగిస్తున్న పోసాని కూతురు చిన్నారి అదృశ్యమైందని అన్నారు. రెండు రోజుల క్రితం భిక్షాటనకు వెళ్లిన చిన్నారి తిరిగి రాలేదన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గేదెను ఢీకొని ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణ శివారులో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గేదెను ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. నాగిరెడ్డిపేట నుంచి ఎల్లారెడ్డి వైపునకు వెళ్తున్న సాయిలు దేవునిపల్లి గ్రామ శివారులో అకస్మాత్తుగా వచ్చిన గేదెను ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు వారు పేర్కొన్నారు. గాయపడిన వ్యక్తిని 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరి ఆత్మహత్య

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేటకు చెందిన చాకలి బాబు(50) మద్యానికి బానిస కావడంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. బాబు వృత్తిరీత్యా కూలీ పని చేస్తూ జీవిస్తుండేవాడు. బాబు కొన్ని రోజులుగా మద్యానికి బానిస కావడంతో పనులకు వెళ్లడం మానేసి స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అప్పుల బాధ భరించలేక..

మాక్లూర్: అప్పుల బాధ భరించలేక మండలంలోని గాలిబ్‌నగర్‌తండాకు చెందిన బుక్య జ్యోతిలాల్ (55) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధీర్‌రావు బుధవారం తెలిపారు. కొన్ని రోజులుగా మద్యానికి అలవాటు పడ్డ జ్యోతిలాల్ మంగళవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రెంజల్‌లో వాహనాల తనిఖీ



రెంజల్: మండల కేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ బుధవారం తెలిపారు. స్కూల్ బస్సులు, లారీలు, ఆటోలు, జీపులు, కార్లను తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను జప్తుచేసినట్లు చెప్పారు. వాహనదారులు తమవెంట ధ్రువీకరణపత్రాలు ఉంచుకోవాలని సూచించారు. తనిఖీలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

కుటుంబ కలహాలతో తండ్రి హత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: కుటుంబ కలహాలతో ఓ తనయుడు తండ్రిని తల్లితో కలిసి హత్య చేసిన ఘటన మండలంలోని మొగులాన్‌పల్లిలో చోటు చేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దకొడప్‌గల్ మండలం కాస్లాబాద్ గ్రామానికి చెందిన అల్లె రామాగౌడ్(58) పదేళ్ల క్రితం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లోని బొల్లారంకు వలస వెళ్లాడు. అక్కడ కుటుంబంలో తరచూ గొడవలు జరుగుతుండడంతో అతని భార్య సరోజన కుమారుడు అంజాగౌడ్, ఇద్దరు కుమార్తెలతో కలిసి మొగులాన్‌పల్లికి వలస వచ్చారు. రామాగౌడ్ అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడు. ఇద్దరు కుమార్తెల వివాహాలు జరిగాయి. అయితే భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 24న రాత్రి ఇంటికి వచ్చిన రామాగౌడ్ భార్యతో గొడవ పడ్డాడు. దీంతో విసిగిపోయిన కుమారుడు అంజాగౌడ్ తల్లి సరోజన బండరాయితో తలపై మోది రామాగౌడ్‌ను హత్య చేశారు. అదే రోజు రాత్రి అంజా గౌడ్ తన మిత్రుడు సాయిబాబాతో కలిసి మృతదేహాన్ని చీరలో చుట్టి బుడిమి గ్రామ చెరువులో పడేశారు. తర్వాత ఏమీ జరగనట్టు కాస్లాబాద్‌లో ఉండే మృతుడి తమ్ముడు శంకర్‌గౌడ్ ఇంటికి ఈ నెల 26న వచ్చి మీ అన్న కనిపించడం లేదని, ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వస్తోందని నమ్మబలికారు. అంతేకాకుండా హత్య కేసు నుంచి తమను తప్పించాలని గ్రామ పెద్దమనిషి సతీశ్‌ను సహాయం కోరగా అతని నిరాకరించాడు. ఈ విషయాన్ని సతీశ్ మృతుడి తమ్ముడు శంకర్‌గౌడ్‌కు చేరవేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన శంకర్‌గౌడ్ బుధవారం మొగులాన్‌పల్లికి చేరుకుని వదిన సరోజన, కుమారుడు అంజాగౌడ్‌ను నిలదీయగా కుటుంబ గొడవల కారణంగా హత్యచేసినట్లు వారు ఒప్పుకున్నారు. శంకర్‌గౌడ్ ఫిర్యాదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

స్కూటీ దొంగిలించిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: నగరంలోని శివాజీ చౌక్‌లో స్కూటీ దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ప్రవీణ్ బుధవారం పేర్కొన్నారు. వాహనాల తనిఖీ చేపడుతుండగా పోలీసులను చూసి పారిపోతుండగా సిబ్బంది పట్టుకుని విచారణ చేపట్టారు. ఈ నెల 27న గౌతంనగర్‌కి చెందిన సృజన్ స్కూటీని అదే కాలనీకి చెందిన శ్రవణ్ దొంగిలించినట్లు పేర్కొన్నారు. నిందితుడు సిద్దిపేటలో తన స్నేహితులతో కలిసి మూడు ఇళ్లల్లో చోరీకి పాల్పడినట్లు తెలిపారు.

బైక్ చోరీకి యత్నం

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లిలో బుధవారం వేకువ జామున బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. గ్రామానికి చెందిన సామ రాకేశ్‌రెడ్డి మంగళవారం రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచిన పల్సర్ బైక్‌ను దుండగులు చోరీకి యత్నించగా గ్రామంలోని భరతమాత విగ్రహం సమీపంలో వదిలి వెళ్లిపోయారు.

బుల్లెట్ బైక్ చోరీ

భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన నీల రఘు తన ఇంటి ఎదుట ఈనెల 25న బుల్లెట్ బైక్‌ను నిలిపి ఉంచాడు. దుండగులు రాత్రి బైక్‌ను దొంగిలించారు. సీసీ కెమెరాలో ఇద్దరు చోరీకి పాల్పడినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

టిప్పర్లు స్వాధీనం



బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండలం అన్నారం గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్లు, నిర్వాహకులపై కేసు నమోదు చేయించినట్లు తహసీల్దార్ జనార్దన్ బుధవారం తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో టిప్పర్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేయించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా మొరం, ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



భీమ్‌గల్ : మండలంలోని ముచ్కూర్, లింగాపూర్ గ్రామాల్లో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై హరిబాబు బుధవారం తెలిపారు. ముచ్కూర్‌లో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు, లింగాపూర్‌లో ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా అక్రమంగా మొరం, ఇసుక తరలిస్తే కేసు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ, సిబిల్ అవసరం లేదు, NPA కూడా ధరఖాస్తు చేసుకోవచ్చు, సిటీకాపిటల్ సర్వీస్, విష్ణు,87690 57367. [T-223]

CHANGE OF NAME
■I, BANDI LAXMINARSAVVA (OLD NAME) Nizamabad. Hence Changed my name as KACCHAKAYALA LAXMI NARSA, W/O. KACCHAKAYALA NEELA KANTAM (NEW NAME). [Z-799683]

WANTED
■మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్‌గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9849933042, 9177736926. [M-1167575]
■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k. సంప్ర: 9160900024 / 9640400073. [H-793669]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.